9-8-70

విప్లవ రచయితల సంఘం

S.No: 2130
Acc No: 21,632.

035, INRD, J
35 N70
150254

ఈనాం ఈనాం

గేయసంకలనం

సంకలన కర్త:

కె. వి. రమణారెడ్డి

S.NO: 2139

Accno: 21,632.

విప్లవ రచయితల సంఘం ప్రచురణ

తొలి కూర్పు:
1970 అక్టోబరు
ప్రతులు :
1000

ముఖచిత్రం:
చంద్ర

035, INRD, J
35 N70

వెల :
ఒక్క రూపాయి

150254

ప్రతులకు :
నిఖిలేశ్వర్
40, విద్యానగర్ కాలనీ
హైదరాబాదు-13

ముద్రణ:
క్రాంతి ప్రెస్,
12, ఫ్రాన్సిస్ జోసెఫ్ స్ట్రీట్,
మద్రాసు-1.

విషయ సూచిక

అంకితం		
ప్రళయ గాయకునికి		చార్వాక
కొత్త గుండెల చప్పుళ్ళు వింటారా		కె. వి. రమణారెడ్డి
గెరిల్లా సూర్యుడు	....	అజ్ఞాతవాసి
చీకటికూడా ఎరుపెక్కింది	....	అశోక్
తెర వెనుక	....	ఎక్స్-రే
నగరంలో సూర్యోదయం కోసం	....	ఎన్-కె
సత్యమేవ జయతే	....	కిషన్
కదనానికి పిలుస్తోంది	....	చంద్రశేఖర్
ప్రపంచం నిండా	....	చెరబండ రాజు
ఆకాశం ఎర్రబడుతూంది	....	జ్వాలాముఖి
ఎప్పుడూ అంటా	....	మల్లెల నారాయణ
భయం	....	నిఖిలేశ్వర్
నువ్వు పేదవా?	....	ప్రభంజన్
మహోషస్సు	....	ప్రభాకరదేవ్
జీవితం నేర్పిన గుణపాఠం పోరాటం	....	యాదగిరి
కాంతి అణగారదు	....	యారో
అ-క్రమం	....	కె. వి. రమణారెడ్డి
ఎర్రబడ్డ కళ్ళలోంచి	....	రవ్వ
ఓట్ టు ఓట్ కాదు	....	లోచన్
రక్షించండి! రక్షించండి!	....	వరవరరావు
ఆహ్వానిస్తోన్నాను విప్లవాన్ని	....	సి. విజయలక్ష్మి
ఎర్ర చేపల మహాసభ	....	విరాట్ స్వరూప్
సత్యం చావదు (డు)	....	శివుడు
నరుడో! భాస్కరుడా!	....	శివుడు
ఝుంఝు	....	శ్రీ.శ్రీ.
నిన్నటి జట్కావాలా	....	శ్రీ.శ్రీ.
కాలం కాలిన పొగ వాసన	....	కోట సత్యనారాయణ
సైన్యంలో చేరకు	....	జ. సోమయ్య
జననం	....	నగ్నముని

అంకితం

కలంతో కాలాన్ని గెలిచి
కదనంలో నేల కొరిగిన
శ్రీకాకుళ గిరిజనోద్యమ కవి
సుబ్బారావు పాణిగ్రాహి
అరుణామర స్మృతికి.

ప్రళయ గాయకునికి

గుమ్మెట లెందరు వాయించలేదు?
గుమ్మెట మోతలనే సమ్మెట పోట్లల్లా
నీలా నిజంగా
నీ నా విరోధుల మీదికి దించిన వాళ్ళేరీ?

ఉత్తుత్తి వాగ్దానాలు తొత్తుల కైవారాలు
గుత్తకు గొన్న వృత్తి భిక్షుకుల ఆలాపనలను
నీలా నిష్కర్షగా
ప్రేలాపన లనిపించిన మహనీయు డేడీ?

దేశభక్తితో దైవభక్తినీ దేహరక్తినీ రంగరించి
కంకణాలతో కండువాలతో బాకాల కాకాల నూదారే గాని
నీలా నిండు మనస్సుతో
గుండెల మంటలనూ కన్నీళ్ళ సెగలనూ గానంచేసిన వాళ్ళేరీ?

కలం పట్టిన వాడో హలం పట్టిననాడో కాకుండా
ధామందు రాబందులో పాలక పాతకులో కాకుండా
నీలా నిబ్బరంగా
ప్రజలను ఉద్బోధిస్తూ ప్రభంజనం రేపిన వాడేడీ?

కలాన్నీ కత్తినీ పట్టి రెంటినుంచీ అగ్నిని రాబట్టి
చావులేని బాటలో చావెరుగని పాటతో
నీలా నిజాయితీగా
నడిచి గడిచి పోగలిగిన ధీరులుంటే, ఏరీ?

—చార్వాక.

కొత్త గుండెల చప్పుళ్లు వింటారా?

విప్లవ రచయితల సంఘం ఏ సాహిత్య సంస్థకూ పోటీగా ఏర్పాటు కాలేదని నే నంటే చాలామంది నమ్మకపోవచ్చు గాక, ఇది నిజం! సమకాలిక చరిత్ర దీనికి పుట్టిల్లు. అది సంఘ చరిత్రా, సాహిత్య చరిత్రా కూడా.

అభ్యుదయ రచనా సంప్రదాయం గొప్పది. శ్రీ శ్రీ విప్లవ కవిత్వంద్వారా ఆంధ్ర సాహిత్యంలో ఇది స్పష్టమైన ఆకృతి ధరించింది. కుటుంబరావుగారు దీనిచేత మేలి పంట పండించారు. అభ్యుదయ రచయితల సంఘం రెండు దశాబ్దాలపాటు పత్రిక ద్వారానూ సభలూ పాఠశాలలూ ద్వారానూ దీన్ని శ్రీ శ్రీ, కుటుంబరావుల తరం రచయితలనుంచి అనిసెట్టి-కుందుర్తి-సోమసుందర్ తరం రచయితలకు అందించి కృతార్థమయింది. ఇటీవలి కాలంలో రచనా వ్యాసంగం మొదలెట్టిన రచయితలు ఈ సంస్థనూ దాని సంప్రదాయాన్నీ ఖాతరు చెయ్యనంతగా అవి కృశించాయి. శూన్యవాదమూ వ్యక్తి వాదమూ కొత్త కారు రచయితలను ఆకట్టుకొన్నాయి. సామాజిక వాస్తవంలోని అల్పిష్టి లక్షణాలనో అశుభ్రాంశాలనో వస్తువుగా స్వీకరించి రచయితలు పీత నడకలు పోసాగారు. వార పత్రికలూ, మాస పత్రికలూ పనికిమాలిన ఊకను పదేపదే దంచుతూ పోయాయి. చవక రచనల గిరాకీ హెచ్చింది. సంప్రదాయాన్ని చాదస్తమని భ్రమపడుతూ భ్రమపెడుతూ మతతత్వం పడగలు విప్పి ఆడుతూ వచ్చింది. జీవితమూ, సాహిత్యమూ నిస్పృహతో పలచబడిపోయాయి. ఇజాల నిరసన మార్క్సిజం నిరసనగా తప్ప రూపొందలేదు. శాస్త్రీయ విషయాలనూ, వైజ్ఞానిక విజయాలనూ చులకన చేస్తూ బుద్ధివాద వ్యతిరేక ధోరణులు భావలోకంలో బలపడసాగాయి. భావ స్వాతంత్ర్యం పేర రచయిత స్వానుభూతి పేర సమిష్టివాద వ్యతిరేక కమ్యూనిస్టు విముఖత మళ్ళీ వ్యక్తి వాదానికి మూర్ధాభిషేకం చేసే స్థితి వచ్చింది. ఈ దుస్థితి నిన్నటిదే కాదు, నేటిది కూడా.

కమ్యూనిస్టు వ్యతిరేకులు చేస్తున్న భావాల పోరాటానికి జతగా, అభ్యుదయ రచయితల సంఘ సారథులు 'విశాల వేదిక' పేరిట సాహిత్యాది భావరూపాలకు లెనినిస్టు నిర్వచనానుసారంగా అనివార్యమైన వర్గ దృక్పథాన్ని నీరు గార్పించి వేసేందుకు ఆచరణలోనైనా తోడుపడ్డారు. 'మానవతావాదం' అని ముద్దు పేరు పెట్టుకొన్న ఒకానొక సర్వ సామరస్య వైఖరిని మిన్నుల కెత్తుతూ కొందరు 'కమ్యూనిస్టు' ప్రబుద్ధులు విచిత్రమైన సిద్ధాంతాన్ని ప్రకచించడం ప్రారంభమైంది. ఎల్ల కాలాలకూ మార్పు చెందని 'అభ్యుదయం' అనే అబద్ధ పదార్థం ఒకటి పరిగణనకు వచ్చింది. నన్నయభట్టు మొదలు నేటి నజ్జు కవులవరకూ అందరూ ఇంతో అంతో 'అభ్యుదయ' రచయితలుగా 'కమ్యూనిస్టు' పత్రికలలో ప్రశంస లందు కోసాగారు. తమ రాజకీయ విధానాలకు ఇలా సాహిత్య

భాష్యాలు మొదలయ్యాయి. దేశంలోని కుళ్ళునూ కంపునూ వాటికి యోగ్యమైన బూతు మాటలతో బయట పడేశారని 'దిగంబర' కవులను పడదిట్టడం కూడా ఈ 'కమ్యూనిస్టు' విమర్శకుల దృష్టి మాంద్యానికి మరొక నిదర్శనమైంది. ఈ కవు లేమో అరాచక వాదులుగానూ, మార్క్-సిజం వాసన గూడా కిట్టని కవులేమో మానవవాదులుగానూ వీళ్ళకు కనిపించసాగారు.

సంకల్ప పూర్వకంగానో అసంకల్పితంగానో, అయిన వారినుంచీ, కాని వారినుంచీ అభ్యుదయ రచనా సంప్రదాయాన్ని గోతబెట్టే దుస్సంకల్పమే,విప్లవ రచయితల సంఘం ఏర్పాటు కావడానికి తోడ్పడింది. భావాల జడిమను వదలగొట్టాల్సిన అగత్యం ఏర్పడింది. రచనల ద్వారా రచయితలు కూడా ఉత్తేజం పొందలేని దుస్థితినుంచి రచయితలే గాక పాఠకులూ, ప్రజలూ ఉత్తేజం పొందగల స్థితికి సాహిత్యాన్ని కొనిపోవాలనేది మా సంకల్పం. భావ సంచలనం రాజకీయ చైతన్యోద్దీప్తికి కూడా అవసరం. అంతిమ ఫలంగా జీవితమే మారాలి. ఈ సమూలమైన మార్పుకు తోడ్పడే ప్రజాశక్తులకు సాహిత్యం ద్వారా తోడ్పడ్డం, సాహిత్య మూల్యాలకూ సాహిత్య ప్రయోజనానికీ ద్రోహం చెయ్యడమేమీ కాదు. 'స్వేచ్ఛ' అంటే తన చర్మ కవచంలోపల తా నొదిగి పోయి, స్వీయానుభూతి నెపంతో తన సాంఘిక ప్రాతికూల్యాన్నీ భావ వైక్లవ్యాన్నీ చూపెట్టుకొనే రచనలు చెయ్యడం కాకుండా, చరిత్ర పురోగతి నాశించే సామాజిక శక్తులతోటి ఏకీభావాన్ని చూపెట్టే రచనలు చెయ్యడమే! వ్యక్తి వాదం రాజకీయంగా ధనస్వామ్య వ్యవస్థకు తల్లి. సాహిత్యపరంగా విశృంఖల, భిధిల భావజాలానికి మారు పేరు. ధన స్వామ్యాన్నీ దాని రాజకీయ మాయాజాలాన్నీ కంటగించుకొనే విప్లవ రచయిత, దాని కోటి రూపాలలో ఒకటైన ఈ నిరర్థక వ్యక్తి వాదాన్ని కూడా నిరాకరించక తప్పదు.

ప్రజా శ్రేయస్సును ఉపలక్షించి రచనలు చెయ్యడం ఏదో మహాపరాధమైనట్లుగానూ అభ్యుదయ రచయితలకు నిజాయితీ లేనట్లుగానూ, ప్రజలు తమ బాగోగులు తామే విచారించుకొని తను పతనాభ్యున్నతులకు తామే పూర్తి చైతన్యంతోటి పూచీ పడగలుగుతున్నట్లుగానూ, ప్రజల పేరు చెప్పుకుంటూ 'అభ్యుదయ' రచయితలు బాగు పడ జూస్తున్నట్లుగానూ, రంధి సోమరాజు శ్రీశ్రీ కి గురి పెట్టిన కొక్కిరింపు గేయ మొకటి విసిరితే దాన్ని బుజాన వేసుకు 'ఆహా!' అని అనమనే ఆర్. యస్. సుదర్శనంగారిలాంటి తజ్జులు తయారైన రోజు లివి. ఇదంతా ఎదుగుదలగా వీరికి కనిపిస్తున్నది. ఈ విసురు తమకు తగలలేదని అభ్యుదయ రచయితల సంఘం కిమన్నాస్తిగా ఊరకుండిపోతేపోనీ విప్లవ రచయితలు మాత్రం ఇదిగో "ఝంఝ"గా రూపొందుతూన్న ప్రబల గేయ వీచికలతో ఎదుగూ బొదుగూ లేని ఈ పుట్టగొడుగు వాదాలను ఎగరగొడుతారు.

సాహిత్యపరంగా విప్లవ రచయితల సంఘం గొడ్డుబోక తప్పదంటూ ఒక 'ప్రజాతంత్ర' విమర్శకమ్మన్యుడువేసిన అక్షింతలు కంకర రాళ్ళుగా అతగానికి ఎదురు మళ్లేందుకు ఈ గేయాలు చాలు. ప్రాసప్రాశనంచేసి మాత్రలు మింగి ప్రబంధాలను పుల్లగా తేనుస్తూన్న ఒకానొక అకటావికట కవిమల్లుడు విప్లవ కవులను 'ప్లవంగాల'తో పోల్చి వాళ్ళకు 'లవంగాలు' బహూకరిస్తూ గేయం రాయడం తన అల్పబుద్ధికి తానే ఇచ్చుకొన్న యోగ్యతాపత్రం లాంటిది. జీవితంలోనూ సాహిత్యంలోనూ రాసాగే మార్పులు ఇలాంటి పుల్లవిరుపు మాటలను జూచీ మూతివిరుపు చేష్టలకు జడిసీ రాకుండా పోవు. సకాలంలో వాటిని గమనించి బలపరిచేవాడు ఇలాంటి గబ్బిలాలకు అవకాశవాదిగానే కనిపిస్తాడు.

పాతవాళ్ళు ఒకరిద్దరు ఈ సంకలనంలో ఉన్నా ఇది ప్రధానంగా కొత్తతరం రచయితల గేయ సంపుటి. బతుకుతో రాజీలేని పోరాట వైఖరిగల గేయాలు, అభ్యుదయ రచయితల సంఘం చేజేతులా వదిలివేసిన అభ్యుదయ రచనా సంప్రదాయాన్ని విప్లవ మార్గంలో పునరుజ్జీవింప జేస్తున్నాయి. ఈ తరం కళ్ళముందు, మెరుపులా మెరిసి ఉరుములా మోగి ఇంతలో తుపాకుల మోతలతో జైలు శిక్షలతో కాల్పులతో కూల్పులతో హింసలతోహత్యలతో తాత్కాలికంగా మందగించక తప్పని సమకాలిక సాయుధ పోరాట మొకటి ప్రముఖంగా నిలిచి ఉంది. ఎవ్వరేవిధంగా దాన్ని విమర్శించినా, అది ప్రధానంగా యౌవనం నడిపిన ఉద్యమం. అందుచేతనే యువకులూ విద్యార్థులూ దీనికి ప్రతిస్పందించినట్లుగా కాగి చల్లారినపాల వయస్సుగలవాళ్ళు ప్రతిస్పందించలేకపోయారు. యువకుల ప్రతిస్పందనలు ఎన్నో గేయాలుగా రూపొందాయి-వీర గేయాలూ విలాస గేయాలూ—ఏవైనా ఒక ఉద్యమానికి అంకితమైనట్టివే. చరిత్ర గర్భంలోని పరిణామ శిశువు హృదయ స్పందనల్లాంటివి.

ఈ కొత్త గుండెల చప్పుళ్ళను వింటారా? వినండి! ఇందులో అసలు సిసలు కవిత్వం తక్కువ, రాజకీయం స్పృశించిన ఉద్యమం కలిగించిన కవిత్వం ఎక్కువ, అంటారా? అనండి! కవి స్వీయానుభూతి గాక మంది అనుభూతి ఈ రచనలను నిర్ణయించిందని విమర్శిస్తారా? విమర్శించండి. అయ్యో, కొందరు కవులనుంచి మనం ఆశించిన బూతు ఇందులో లేదే అని ఆశాభంగం పొందుతారు మీరు. దిగంబర కవుల కూటమిగానీ తిరుగుబాటు కవుల కూటమిగానీ మరి లేదు. వీరంతా శ్రామిక విప్లవ విజయానికి సాహిత్యాన్ని కూడా ఒక ఆయుధ విశేషం చేసుకొన్నారు. తామొక రాజకీయ పార్టీ కాకుండానే రాజకీయ పార్టీల తోకుచ్చుకు పోకుండానే, జాతి జీవితాన్ని అనన్యంగా నిర్ణయించగల రాజకీయాన్ని దాని నేటి దుస్థితినీ రేపటి సదవకాశాలనూ గమనించి గౌరవిస్తున్నారు. రచయితలకు గల పౌర బాధ్యతలను తృణీకరించడంలేదు. వీరందించ బూనుకొన్న ఉప్పును జనం అందుకొంటారు. అప్పుడిక మొదలు కాబోతుంది జన హృదయాలనుంచి మహా ఝంఝూ ప్రభంజనం!

—కె. వి. రమణారెడ్డి.

గెరిల్లా సూర్యుడు

అజ్ఞాతవాసి

భూమి బానిసత్వం చీకట్లలో గాను గెద్దులా తిరుగుతున్నపుడు
సూర్యుడు చంద్రహాసాలు నూరుకుంటూ
నక్షత్రాలు చెక్కుకుంటూ
చల్లగా చూస్తూ, నీళ్ళలో చేపవలె
చీకట్లో మసక వెన్నెల భావంలా వ్యాపిస్తూ
అజ్ఞాతంలో ఉంటాడు
వెలుగువంటి ఆలోచనలు సమకూర్చుకొని
వేడివంటి ఆయుధాలు అమ్ముల పొదిలో పేర్చుకొని
చీకటి గుండెను చీల్చిన రక్తంలో తడిపిన
ఆకాశ ఎర్ర జండా తూర్పు కొండమీద పరుస్తూ
ఉదయించే సూర్యుని తొలిసారిగా చూసిన
భూమి సూర్య నమస్కారం చేస్తుంది
చుట్టూ ప్రదక్షిణం చేస్తుంది
పిట్టలూ, చెట్లూ, పొలాలూ. మనుషులూ
సృష్టి సృష్టి అంతా విప్లవోదయ దినకాంతి
సంచలిత కార్యోన్ముఖులు
కాంతి ముఖులు
తెల్లారితే సంతోషించని వాళ్ళు
రాక్షసులూ, గుడ్లగూబలూ మాత్రమే
చీకట్లో చితికిన భూమికి మాత్రం
సూర్యుడొస్తే బతుకు వెలుగుతుంది

★

చీకటికూడా ఎరుపెక్కింది

అశోక్

అన్నా!
నీ గాయాలపై నుండి వీచి
గాలి ఎరుపెక్కింది
నువ్వాసరా చేసుకున్న బొడ్డుమల్లె
ఇపు డెర్రగా పూస్తున్నది
నువు పడిపోయిన చోట
భూమి ఎరుపెక్కింది
నీ పాదాలను తాకి
చెలిమె ఎరుపెక్కింది
నీ చితి
నిప్పులేకనే మండింది
మరొక్కటి వినన్నా!
నువు కొట్టిన బాణం దెబ్బకు
గాయపడి
చీకటీ ఎరుపెక్కింది!

★

తెర వెనుక

నీకు తెలుసో తెలీదోగాన్నేస్తం
తెర వెనుక వాళ్ళు స్టేజి మీదకు రానే రాకూడదు
వస్తేనో
మీసాలెవరు కట్టారు మన నటులకి
వేషాలెవరు వేస్తారు
ప్రాంప్టింగ్ అందకపోతే అంత నటుడు కూడా డౌన్ అయిపోతాడు
ప్రేక్షకులు గోలెట్టెస్తారు
అలా కాకుండా
తెర వెనుక మనుషులకి సత్తా ఉంటేనో
నేస్తం
రంగమ్మీదున్న నటులకి మా మంచి బలంగా వుంటుంది
ఎక్కళ్ళేని ఉషారులో ఊపేస్తారు
జనం చేత చప్పట్లు కొట్టిస్తారు
గ్రీన్ రూంలోకి వెధవల్నెవ్వర్నీ రానీకు నేస్తం
ఇంతో అంతో అందరికీ భాగోతం సంగత్తెలుసు
కాని అంతమాత్రమే చాలదు
మన నాటకం కోసం ప్రాణాలు పెట్టి టికెట్లుకొని వస్తున్నారు
వాళ్ళకి మనమీద గురి కుదరాలంటే
నేస్తం
మన నటులకి కావలసిన కత్తి కవాతులు అందజేస్తుండాలి
గ్రీన్ రూంలో చాణక్యుల్నే ఉంచాలి
నెత్తురుతో హామీ రాసి బోర్డు కట్టుదాం రా

★

నగరంలో సూర్యోదయం కోసం

ఎన్. కె.

కృత్రిమ కరువుల ఆవాసంలో
ఎంత చిట్లించినా కళ్ళల్లో చీకటి
యింకిపోతున్న ఆశ
యిగిరిపోతున్న వూపిరి
నగరంలో సూర్యుడు లేడు

సత్యం గుండెల్లోంచి దూసుకుపోయిన గుండు
అన్యాయం కాళ్ళదగ్గర మోకరిల్లినప్పుడు
అధికారం తిప్పిన మరల్లో
చూపిన ఎరల్లో
గాలి గాలి వార్తల్నే మోసుకొచ్చినప్పుడు
వెలుతురు కొంత రక్తంలో నల్లబడి
మరికొంత న్యాయాధికార్ల నోళ్లల్లో మూతబడి
మిగిలింది అడవి గర్భంలో వెలుగుతున్నప్పుడు
సూర్యుడు నగరాన్ని వెలివేశాడు
ఎలుగేసిన కానలకోసం అడుగేశాడు

అడవి శిరస్సుమీద సూర్యుడు
అడవి ఒడిలో సూర్యుడు
అడవి అడవంతా సూర్యుడు
అక్కడి ప్రతి చెట్టునూ
పచ్చి గడ్డినీ అడిగిచూడు
ప్రతి పుట్టనూ
మట్టి బెడ్డనూ అడిగిచూడు
పెద్ద గుట్టనూ
గులకరాయినీ అడిగిచూడు

అడవికి అర్థం చెబుతాయి
పులి-మేక ఆటలోని పాఠం చెబుతాయి
అడవుల్లో విచ్చుకున్న పూలు
పరాయి దేశంలోని తమ వాళ్ళను గురించి
మనసులు విప్పుకుంటున్నాయి

నగరం నడిబొడ్డు మీంచి
కదలి వచ్చిన కసాయి వేటగాని యీ పెకు గురియై
అడవి తల్లి అల్లల్లాడితే
నగరంలోని బిడ్డల ముఖాల్లో
నెత్తుటి నరాలు తేలాయట
ప్రజల గుండెల్లో అగ్ని రగిలిందట
ప్రజల కడుపుల్లో పేగు కదిలిందట

నేడో రేపో
తమ వాళ్లంతా తమకోసం రానున్నారని
వచ్చిన సూర్యుడు వార్తల్ని తెచ్చాడు

★

రుంరు.... ....

సత్యమేవ జయతే

కిషన్

నినాదం మీది ప్రేమతో గాక
నిజాయితీ మీది నమ్మకంతో
తుపాకీ అందుకున్న నిన్ను....
రోజుకొక పార్టీ, పూటకొక గ్రూపుమార్చే
దగాకోర్ల గుంపు ఎలా సహిస్తుందనుకున్నావయ్యా?!
కుళ్ళి పురుగులుపడి లుకలుకలాడుతున్న
తమ గుండెనీ—మెదడ్నూ,
నీ మనోదండి దర్పణంలో నీ తిరుగుబాటు భూతద్దం
వెయ్యింతలుచేసి చూపిస్తే తేళ్లూ జెర్లూ పాకినట్లై
గంగ వెర్రులెత్తి మతిచెడ్డ పైశాచిక ప్రభుత్వం
మానవత్వపు విలువల్ని ఎలా కాపాడుతుందనుకున్నావయ్యా?
నీ కళ్ళల్లో వెలిగే నిశ్చయ నిర్ణయాలు,
నీవు గొంతెత్తితే నినదించే విస్ఫుట విప్లవ గీతాలు,
నీ అడుగులో ప్రతి ధ్వనించే ప్రజా సైన్యం కవాతులు
నీవు కొండంత ఆత్మ స్థైర్యంతో ఈ వ్యవస్థపై
చేసే జుగుప్సలేని ఛీత్కారాలు....
ఈ ప్రభుత్వం అట్టడుగు కందకాల్లో పైన మెట్లు దట్టిస్తున్నాయని
తెల్సినపుడు—ఈ పిరికి పందలు,
ఎన్ని కిరాయి చేతులతో గుండెలు బాదుకున్నారో
చెప్పడమే కదూ, నిన్నొంటరిగా....రాక్షసంగా
కాల్చేసి అబద్ధం ప్రకటనలమీద
రక్తం ఆరని చేత్తో చేసిన సంతకానికి అర్థం—!
పిరికిగా, కొరతగా, అవమానంలో నూరేళ్ళ
జీవచ్ఛవంలా గడపడం కన్నా
ఒక సమున్నత ఆశయం కొరకు చావడం మేలుకదూ?

★

కదనానికి పిలుస్తోంది

చంద్రశేఖర్

న్యాయాన్ని అన్యాయం
నడివీధిలో నలుగురెదుటా
కిరాయి కత్తులతో ఖూనీ చేస్తుంటే
ధర్మాన్ని అధర్మం
అధర్మ ప్రభువుల అవినీతి కౌగిల్లో
మాన భంగంచేసి మలిన పరిచేస్తుంటే
సత్యాన్ని అసత్యం
పోలీసు బందోబస్తుతో
పట్టపగలు కాల్చి కసి తీర్చుకొంటుంటే
ఆకలిని తింటూ
అబద్ధాన్ని తాగుతూ
అవినీతి బురదలో పందుల్లా పొర్లాడలేక
మగత నిద్రలోంచి మేల్కొంది యువత
నిప్పులు చిమ్ముతూన్న యీ శక్తి
యీ తప్పుడు వ్యవస్థని మొదలంటా కాలుస్తుంది, తప్పదు.
ఉధృతంగా వీస్తున్న యీ ప్రభంజనం
రాతి యుగం చిహ్నాలను ఊడ్చేసే తీరుతుంది
ఉరకలు వేస్తున్న యీ మహా ప్రవాహం
మరో ప్రపంచాన్ని అభిషేకిస్తుంది
కదం తొక్కుతున్న యువత
యీ కదనానికే పిలుస్తోంది.

★

ప్రపంచం నిండా...

చెరబండరాజు

ఆకాశం కింద విశాల హృదయంతో
వస్త్ర హీన దేహాలతో
మండే కడుపులతో
రక్తాన్ని ఇంధనంగా మార్చి
పాలకుల రైలు ఇంజన్ని ఊడ్చుకుపోతున్న
కార్మికులం కర్షకులం నిరుపేదలం మనమే

స్నేహానికీ ప్రేమకూ చేతులందిస్తే
రోగాలూ నొప్పులూ అప్తులతో గోడుగోడునా చెప్పుకుంటే
మనిషికి మనిషేగా తోడూ నీడా అంటే
పోరాటం మినహా బతుకూ భవిష్యత్తూ అసలే లేదంటే
కంఠాల నిండా ఇనపముళ్ళు కుక్కే చట్టం
కంటి రెప్ప లెత్తితే కాల్చేస్తా మంటోంది

కడలి తప్ప కన్నీటిని బోధపర్చుకునే దెవరు
కడుపు బాధలకు నేల తప్ప
కరుణా ప్రేమలతో చెవియొగ్గే దెవరు

ప్రపంచం నిండా మన చేతుల్లో
ఆకలి ఆక్రందన లెత్తించిన పతాకాలు
ఒకే లక్ష్యసాధనకై
ఒకే ధర్మసాధనకై

మానవతా సంకేతాలై
మంటల్లో పడిలేచీ
వానల్లో నాని ఎండి
తుపానుల్ని అడ్డుకొనీ
భూగోళం గుండెపైన
అవిగవిగో అవిగవిగో అనవరతం ఎగిరేను
మరికొంచెం మరికొంచెం మరికొంచెం
సరిహద్దులు అధిగమించి
శ్రామిక రాజ్య సందేశాన్ని వినిపిస్తున్నాయ్
మనం హరిజనులం గిరిజనులం
అనాగరికులం అడవి మనుషులం
నీగ్రోలం బానిసలం

కాయకష్టంచేసి కనాకష్టంగా బతికే వాళ్ళం
అన్నానికీ ఆనందానికీ
కౌటుంబిక అనుబంధానికీ
సభ్యతకూ సంఘంలో
సమానత్వ హక్కులకూ
అనర్హులం భయస్థులం
నోరులేని జీవులం
జైళ్ళూ కోర్టులూ చట్టాలూ సంకెళ్ళూ పోలీసుల బయినెట్లూ
అవునవునూ
మన శాంతికి మన భావికి
మన జీవిత సౌఖ్యానికి

అర్ధరాత్రి రేడియో విప్పండి
ఏ ఉదయమైనా వార్తా పత్రిక తిప్పండి

పొలాల్లో అడవుల్లో
ఫ్యాక్టరీల సమ్మెల్లో
చంపబడ్డ రాక్షసులం
రాజద్రోహులం హంతకులం
ఉరికంబం ఎక్కే వాళ్ళం అంతా మనమే
అరో పరకో అటో యిటో
మన నేరాలన్నీ ఒకే సెక్షను కింది కొస్తాయి
అందుకే
దారి తప్పిన సోదరులందరిదీ ఒకేదారి

★

రాత్రి
విచ్చుకున్న భయ భీతావహం
క్రూరంగా కురుస్తూన్న దోపిడి
పామరులను చీకట్ల పోట్లతో
వేధిస్తున్న స్వతంత్ర రాత్రి
అమానుష ప్రజాస్వామి
అతిభయంకర మర్యాదా పురుషో త్తముడు
రాత్రి పరిపాలన
చీకటి బలగాల పీడన
ఉదయం రాకుండా
ఊరంతా కాపలా
పామరులు
శ్రమజీవులు
ఆకలి సంచారులు
బతుకులేదు
తెరువులేదు
నిలకడలేదు
నిలువ నీడలేదు
కాలినడక ఆగలేదు
కాయకష్టం మానలేదు
ఆశల చీమల బారుల
అనంత ఆకలి యాత్ర
కాళరాత్రి చీకటి వరదలు
తలదాచుకోవడానికి పరుగులు
మధ్య మధ్య మజిలీలు
ఐదడుగులకోసారి
దోపిడీ గుడారాలు

ఝుంఝు.....19

విలాస సభా సంరంభాలు
కసురుతూన్న శాసన జాగిలాలు
వెంటాడుతూన్న రాత్రి సేనలు
మిగిలినవి కన్నీటి పరంపరలు
నిట్టూర్పుల తరాలు
ఆరని ఆకలి
తీరని దాహం
దట్టమౌతూన్న చీకటిలో
రగిలిన ఆక్రందనలో
ఎదురొచ్చిన కాగడాతో
పామర పాంథుల ప్రశ్న—

—"బతుకు తెరువు బాటసారులం
ఆకలితో అలసిన ప్రాణాలం
అనంత శ్రమజీవన యాత్రికులం
కటిక చీకటి కోటలో బతుకుచెడిన బానిసలం
విముక్తి మార్గం కావాలి!
మా బతుకుల గమ్యస్థానం ఎక్కడ?"

—"మీరు వదలి వచ్చిన గూడెం
మీరు చేరవలసిన చలివేందిర
మిమ్మల్ని తరిమేసిన చీకటి స్వాములు
మీ ఆశల నమిలేసిన అనాది శత్రువులు
తిరగబడి పోరాడండి
గత్యంతరం లేదు
లేకుంటే గమ్యంలేదు
ఎంత నడచినా
రాత్రి ఆవలి తీరం రాదు
పోయిన చోట్లా చీకటి కోట
ఇక్కడ అనంతమైన కాళరాత్రి

ఇది భయంకర దోపిడీ ధృవం
చీకటి సామ్రాజ్యం యధేచ్ఛగా సాగుతూంది.

దీన్ని క్రాంతి గునపాలతో కూల్చాలి
ఉదయం దానంతటదే రాదు
చుక్కలన్నీ ఒక్కటై పోరాడుతాయి
తూట్లు పడ్డ రాత్రి
ఉదయ సంధ్యలో ఊపిరొదులుతుంది.—"

—"ఎవరు మీరు?
ఏ యుద్ధంలో క్షతగాత్రులు?
ఆ నెత్తురు కాల్వలేమిటి?
ఏ సేనలో పిపాయీవి?
మిగతా వారేరి?
మీ విజయం సంగతేమైంది?
మీ వూరు పేరేమి?"

—"మనదంతా ఒకేవూరు
మనమంతా చీకటి మండలం అంతేవాసులం
సస్యశ్యామల బహిష్కృతులం
ప్రపంచ దేశంలో మనదొక కుగ్రామం
వెలుగు చూడని గుడ్లగూబలు
బతుకుల్ని తలకిందుల తూచే గబ్బిలాలు
మన గ్రామదేవతలు
ప్రపంచ చీకటి ప్రతినిధి
మన గ్రామ మునసబు
మన గ్రామ పంచాయితీ
చిక్కని చీకటి మండలం
వెలుగు రానీయకుండా
ఏకగ్రీవ జాతీయ తీర్మానం—
ఎర్రలాంతరు పట్టుకొని

పంచాయితీలో ప్రవేశించి
చీకటి భగ్నం చేయదలచిన
సోదర శూరులంతా
ఎర్రలాంతరు బద్దలుకొట్టి
చీకటి చీర కుచ్చిళ్ళు సవరిస్తున్నారు
పామరుల క్రాంతి దాహం తాకట్టు పెట్టారు
పడుపు కూడుతో పొట్ట నిమురుకుంటున్నారు

చిరిగిన విస్తరాకులు మన బతుకులు
విందు భోజనం మెక్కి పారేశారు చీకటి దొరలు
ఎంగిలాకులమై పెంటలనిండా ఎగురుతున్నాం
అధికారం కుక్కలు వెంటాడుతున్నాయి
చెట్టుకొకరం గుట్టకొకరం చెదిరిపోయాం
మాదంతా ఆకలి కొండల ఆదివాసుల ప్రాంతం
ఇరుల గిరుల్లో వెలుగు మంటలు మండిస్తున్నాం
రాత్రి స్వాములతో సమరం సాగిస్తున్నాం

నా వాళ్ళు
ఆకలి గొన్నవాళ్ళు
అన్యాయం వాత బడ్డవాళ్ళు
అంధకారం అసహ్యించుకునేవాళ్ళు
దీర్ఘవిముక్తి యుద్ధం రగిలిస్తున్నారు
ఆ త్యాగధను లంతా
నిర్మల నక్షత్రాలు
సంపూర్ణ మానవతామూర్తులు
చీకటిని ఛేదిస్తూన్న రాత్రి భాస్కరులు
పామర గణాలను పదిల పరుస్తూన్న గణపతులు
క్రాంతి పాణిగ్రహణానికి
పరితపించిన విప్లవ శ్రామిక గీతాలు
కష్టజీవుల కైలాసాలు
అన్నార్తుల అంగరక్షకులు
గిరిజన క్రాంతి కేసరులు
సమతా సుందర తేజేశ్వరులు
కొందరప్పుడే వెలిగి రాలిపోయారు

కొందరింకా చీకటిని చీలు స్తున్నారు
లక్ష నక్షత్రాలు రాలందే
ఉజ్వల ఉదయం ప్రవహించదు
రాలిన నిర్మల నక్షత్రకాంతులే
రేపటి సూర్యోదయ కిరణాలు
నేటి నిర్మల త్యాగాలు
రేపటి తూరుపు సౌరభాలు

అదిగో అటు చూడండి
ఆ వీర విహారాలు కనండి
రణన్నినాదాలు వినండి
తూరుపు కొండలు మండుతున్నాయి
చీకటి చావు తెలివి కదం తొక్కుతూంది
రాత్రి రూపం పగులుతూంది
ఆకాశం ఎర్రబడుతూంది
రాత్రి ఉదయాల సమరం సాగుతూంది
కాళరాత్రి విషసర్పాన్ని
జ్వలిత నక్షత్రాలు ఛేదించాయి
రాత్రి ఉరగం నెత్తురు వాంతులు చేసుకుంటూంది
ఉజ్వల ఉదయం ఉధృతంగా రాబోతూంది
మీరంతా మిగిలిన నక్షత్రాలతో చేరండి
తూరుపు ఎరుపు హోరుకోసం
నిర్మల నక్షత్రాలై పోరాడండి
వెళ్తాను సెలవు
విజయం మనకు తప్పదు
విప్లవాలు సుదీర్ఘ సాయుధ ప్రయాణాలు
చీకటితో పోరాటం ఆపవద్దు
రాత్రితో రాజీ లేకపోవడమే తిరుగుబాటు
ఉజ్వల ఉదయానికి ఎడతెగని పోరాటమే విప్లవం
శ్రామిక సమరంలో క్షతగాత్రుణ్ణి
నా నెత్తురు కాల్వలు
యువతరానికి స్వాగత సంగీతాలు
నేను శ్రామికలోకం సిపాయిని

విప్లవ ఆహ్వానంతో వెళ్తున్నాను
నా పాత్ర ముగిసింది
నేను సత్యం
మీరు సత్యం
నా మరణం అసత్యం
విప్లవం నిష్క్రమించదు
రాత్రి నశిస్తుంది
ఉదయం ఉజ్వలంగా వస్తుంది
మంచి చెడుల పోరాట పరిణామం ఇది
నా కాగడా అందుకోండి
దూరి చీకటంతా కాల్చివేయండి
మీ గ్రామం మీరు ఏలుకోండి."

"మనకు కాగడా విముక్తి మార్గం చూపింది
శ్రామిక శాశ్వత సత్యం వెలిగింది
విప్లవ ఇంధనాలు వాళ్ళు
చరిత్ర దీప్త తారలు
రాత్రి సాయుధ వీరులు
ఉజ్వల ఉదయానికి దారులు
శ్రామిక విజయానికి విప్లవకారులు
విప్లవకారుల వీర నిష్క్రమణానికి
మానవ చరిత్ర
విప్లవాభివందనాలు చెబుతుంది
పదండి పోరాడుదాం
ఉజ్వల ఉదయానికి
నక్షత్రాల వంతెన వేద్దాం—"—

వేగుచుక్క రాలింది సత్యం
పొద్దు పొడుస్తుంది తథ్యం
సమతా సూర్యోదయం నిత్యం
విప్లవం ఆగదు సత్యం

★

ఎప్పుడూ అంటా...

మల్లెల నారాయణ

తమ్ముడూ!

కాగితం పులుల్లాంటి పెద్ద మనుష్యుల పెడబుద్ధుల్ని కాల్చందే
కమ్మనికాలం కాళ్ళముందు వాలుతుందని నే నెన్నడూ
కలలోనై నా ఊహించుకొంది లేదు

ధనమదాంధ రావణుల సంకెళ్ళను బలంకొద్దీ తెంచందే
స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఊడి పడుతాయని నే నెపుడూ
చెవులు చిల్లులు పడేట్లు ఊదింది లేదు

ఈ దుస్సహ బానిస వ్యవస్థ అణుబాంబులా పేలిపోందే
శాంతే పరిష్కార మార్గ పరమావధి అని నేనేనాడూ
నెమరువేసి నెమకిందంటూ లేదు

శాస్త్ర పురాణాదుల భావ పిశాచాదులను గతితర్కం లేందే
భావహేతు వాగ్ధాటితోనే ఉచ్ఛాటనం చేస్తానని నే నో మారూ
నోరు విప్పి చెప్పిందంటూ లేదు

కోటానుకోట్లు విప్లవ పథాన ప్రభంజనంలా పయనించందే
కోటిభావాలు శతకోటి పుష్పాలుగా వికసించవు—అనే
నాడూ నేడూ—ఎప్పుడూ నే నంటున్నా

★

భయం

నిఖిలేశ్వర్

భయం చావులాంటిది
వచ్చే ఉపద్రవాన్ని
ఊరించి ఊరించి
నరాలలో నీరు పారిస్తుంది.

చావు ఒక భౌతిక పరిణామం
మరి అంతగా
చావుకు భయపడి
పశువు కంటే హీనంగా
కండలు పెంచి
కండల తృప్తికోసం మాత్రమే
జీవితాంతం జీవించడం
భయానికి చోటు చేస్తుంది.

రోజూ ఎందరో చస్తారు
కొందరు అమాయకంగా
కొందరు అనామకంగా
మరి కొందరు భయంకరంగా
ఇంకా కొందరు యాంత్రికమైన
చిత్రహింసలకు లోనై
తుపాకి గుండ్లు భరిస్తారు....

చంపిన ప్రతి తుపాకి గుండు
శత్రువు భయానికి గుర్తు
హింసించిన ప్రతి పాశవిక చర్య
అధికారుల పిచ్చికి నిదర్శనం

మరి ఎందుకా భయం?
రోజూ నతికి నతికి
నల్లి లా-పేను లా-ప్రభుత్వ గూఢచారిలా
భయంతో వణికిపోయేకంటే
పో! బతుకు,
నిండుగా బతుకు

ఈ క్షుద్రమైన వ్యవస్థను
మార్చే పోరాటంలో
నీ జీవితాన్ని వెచ్చిస్తే చాలు
నీవు ఎక్కడ చచ్చినా
ఎంత అనామకంగా సమసినా
ఎంత క్రూరంగా మాసిపోయినా
భయం ఏనాటికీ జయించదు
భయంకరంగా
కొల్లగొట్టే శక్తులను పట్టి
భయం సమూలంగా పెకలిస్తుంది.

★

నువ్వు పేదవా?

ప్రభంజన్

నువ్వు పేదవా....? కాదు
బ్రహ్మచేసిన పొరపాటా....? కాదు
ఖర్మ అంతకంటే కాదు
అది నీ పెద్దలు చేసిన పొరపాటు
పెద్దమనుషులు దోచేస్తూంటే
మెదలకుండా ఉన్నందుకు

బ్రహ్మ మనుష్యుల్ని చేయడు
బ్రహ్మనే సృష్టిస్తారు మనుషులు

నా కెందుకులేదు అని
నిలదీసి ప్రశ్నిస్తావని
తెలివిగలవాళ్ళు
సృష్టిస్తారు బ్రహ్మని
అడిగితే పలకని బొమ్మని
ఆ బ్రహ్మే నిన్ను సృష్టించాడని
అది నీ ఖర్మ అని చెబుతారు

ఇప్పటికైనా కళ్ళు తెరు
దోచి దాచిన సొమ్ము
దోచి పారేయ్
దోసిళ్ళతో వెదజల్లేయ్
అప్పుడడుగు అది ఎవరి ఖర్మని
అప్పుడను బ్రహ్మ నడుగని

అప్పుడు ఒప్పుకుంటారు
నువ్వు పేదవు కావని
అప్పుడంటారు అంతా ఒకటని
అప్పుడు నువ్వు పేదవుకావు
ఇక ఎప్పటికీ పేదవు కాలేవు
అందుకే ముందడుగు వెయ్యి
అందరి ముందే అడిగేయ్!

మహోషస్సు

కె. ప్రభాకరదేవ్

యీ కవిత....
మానవతా మహోదయం లా
కరాళ రక్తాంగణాన
విప్లవ విజయధ్వజంగా
పీడిత జనావళికి శాంతి నిస్తుంది.

యీ కవిత—
దురహంకార పూరిత సామ్రాజ్యవాదుల
ఆయువు పట్లను శోధించి ఛేదిస్తుంది.
శ్రామికావళి విజయఘోషలు
యీ విప్లవగానంలో విలీనమవుతాయి.

యీ కవిత....
దుర్మదాంధకార విషవలయాల్లోంచి
ధనిక భూస్వాముల గుండెలను చీలుస్తూ
రుధిర స్నాతమై యిలలో నర్తిస్తుంది
అనాది భయ విహ్వల జాతికి
అభయహస్తం అందిస్తుంది.

యిది, యీ కవిత మాటల
ముత్యాల హారం కాదు
జోకొట్టి లాలించే
లాలి పాట కానే కాదు

యీ కవిత—
కను విప్పును కలిగించే రోచిస్సు
పెను చీకట్లను పోకార్చే మహోషస్సు
నవ యువ విప్లవ రచనా ప్రభా సరస్సు

జీవితం నేర్పిన గుణపాఠం పోరాటం

యాదగిరి

ప్రకాశికల అల్లా ఉద్దీన్ అద్భుత దీపం
నల్లనికాంతి నశించి పోయింది
పంచాయతీల 'మాజిక్ కార్పెట్'
రివ్వున ఎగరలేక లోయలో పడిపోయింది
ఓట్లతో సృష్టిస్తామన్న 'రామరాజ్యం'
కోట్లాది అప్పుల్లో దేశాన్ని తాకట్టుపెట్టింది
రోజంతా దుర్భర నరకాన్ననుభవించి
రాత్రి కలలో స్వర్గాన్ని చూసిన సామాన్యుడు
స్వప్నానికి దూరమవుతున్నాడు
జీవితానికి దగ్గరవుతున్నాడు
జీవితం చెప్పిన గుణపాఠం
పోరాటం
నేర్చుకుంటున్నాడు
శత్రువెవడో స్పష్టమయ్యాక
చక్రమో, చాపమో, కోపమో
చంపడం ముఖ్యం కాని
సహనం పరిష్కారం కాదు
పిరికితనం జపించే శాంతికన్న
పరాక్రమం సాధించే కాంతి మిన్న

★

30.... ....

కాంతి అణుగారదు

యూరో

ఆరింది ఒక దివ్వె
అని నీవు కులకకు
అణుగారిపోయింది
కాంతి అనుకోకు

కన్ను చెదిరిపోవు
కాంతిలో కూర్చుని
కళ్లు మూసుకుపోయి
కాంతి లే దనబోకు

ఆరిపోవదు సుమా
ఆరిపోదా దివ్వె
వెలిగించ బోయింది
వేవేల దివ్వెలను

వెలిగించి
వాటితో ఏకమై వస్తుంది
ఒక్కసారిగ నిన్ను
ఊడ్చివేస్తుంది

ఉన్నతం ఉత్తమం
ప్రజల సామ్రాజ్యాన్ని
కడగండ్లు లేనట్టి
కార్మికుల రాజ్యాన్ని
వెనువెంట తెస్తుంది
వెలుగులను ఇస్తుంది
కష్టజీవుల కండ్ల
కాపురం చేస్తుంది

ఆ-క్రమం

కె. వి. రమణా రెడ్డి

క్రమం తప్పడంలో కూడా
క్రమం ఒకటి ఉంది:
గందరగోళం తాళం
లయ పాటించే విలయం

అలజడి చేసే సందడి
అవ్యవస్థ పైని ఆస్థ
అశాంతిలో సాఫల్యం
ఆత్మార్పణ ఆకర్షణ;

ఉద్విన్నత హృది నగ్నత
ఉత్సాహం వ్యామోహం
ఉన్మాదం జయనాదం
ఉల్లోలం కల్లోలం!

పట్టపగలు పిడుగుల జడి
పువ్వులేకుల బాకువాడి
కదిలే పొద నడిచే గుహ
కలవరపెట్టే తహతహ!

శ్మశానాన శ్రీ వెన్నెల
సొరంగాన మృత్యుహేల
హర్యక్షం సూదికనుల
హఠాత్తుగా క్రూరజ్వాల!

నిలకడపొందే నీడలు
నీటిని కదిలే జాడలు

గాలి చీటి చివరిత్రాళ్ళు
కాంతి పేనినట్టి త్రాళ్ళు!

తారల మీటలు పంపే
తరళ రహస్య వార్తలు
వనవాయు ప్రసారాన
విడిబడు సంకేతాలు!

క్రమం తప్పడంలో కూడా
క్రమం ఒకటి ఉంది

★

ఝంఝ.....33

ఎర్రబడ్డ కళ్లలోంచి

రవ్వా

ఆడవుల్లో, చీకట్లో
గర్జిస్తున్నాయ్ సింహాలు!
గుడిసెల్లో, బురదలో
మొలుస్తున్నాయ్ చురకత్తులు!
ఏడ్చినప్పుడే కాదు, కళ్ళు
కోపంతో ఎర్రబడతాయ్!
ఎర్రబడ్డ కళ్లనీళ్ళు
యాసిడ్‌లా కాలుస్తాయ్!
ఊపిరితో, సత్తువతో
కదుల్తున్న జనసంద్రం
హూరంగా తీవ్రంగా వినిపిస్తూ
చేరువగా వస్తున్నది!
బాజాలు, భజంత్రీలు
ఇనప బూట్లు తోలు పటకాలు
అంతిమ ఘడియల్లో
మదమెక్కి, మత్తుమెక్కి
పిచ్చి పిచ్చిగా నాట్యం చేస్తున్నాయ్
అర్థంలేని మాత్సర్యం
ఆధారంలేని అధికారం
నరమాంసం త్రేనుస్తూ
పుర్రెల దండలు గుచ్చుకుంటున్నాయ్
ఇంకెన్నాళ్ళీ విరగబాటు?
వస్తోంది పెనుతుఫాను

★

రైట్ టు ఓట్ కాదు

లోచన్

కోట్ల అస్థిపంజరాలమీద మస్తీగా కొందరు
రక్తపు గిలాస లెగరేస్తూ
ఆకలి సముద్రంలో మమ్మల్ని తన్నేస్తూ—

ఆకాశాని కెత్తిన పెట్టుబడి—వేయిపడగలు
మా బతుకుల్లో విషం కక్కుతూంటే
మూడు కోతులూ బోడినవ్వులూ జాతిని నిర్వీర్యం చేసేస్తే
ఇంకా వ్యక్తి స్వేచ్ఛ అనే వెర్రి భ్రమలో
వర్గసామరస్యం పన్నిన వలలో
గిలగిలా తన్నుకోలేను

భాక్రానంగల్లూ నాగార్జునసాగర్లూ
'గొప్పోళ్ల' షవర్ బాత్ రూముల్లో ఊడిగాలు చేస్తోంటే
ఈ జాతీయ వంచకుల బడ్మాష్ డ్రామాలో
ఫూల్‌గా నటించలేను
ఈ కొంతమంగలి వెధవల చేతుల్లో నిస్సహాయంగా తల ఉంచలేను

ఇరవైమూడేళ్ళ భయానక చరిత్ర రాష్ డ్రైవింగ్‌లో జాతి మెదడుకి
ఎన్నెన్ని లోతైన సెప్టిక్ గాయాలు
దారిపొడుగునా ఎన్నెన్ని దారుణ దృశ్యాలు

నా చెల్లెళ్ళ దేహాలనిండా పిచ్చికుక్కల కాట్లు
నా పిల్లల అమాయకపు చూపుల్లో కత్తిపోట్లు

ఉష్! భరించలేను
గుండెలో మంట
నరాల తెగింపు

ఇవాళ నా కసి వెలిగించిన నెత్తురుమంటల్లో నిలబడి చెపుతున్నా
మెలితిరిగే కడుపులో ఆకలి మాట అంటున్నా
రైట్ టు ఓట్ కాదు
ఈ దోపిడీ రేచుకుక్కల్ని తరిమి తరిమి
ఫైట్ టు ది లాస్ట్

★

రక్షించండి! రక్షించండి!!

వరవర రావు

రక్షించండి, రక్షించండి
దరిద్రాన్ని, అజ్ఞానాన్ని
రోగాలను, భోగాలను
విప్లవం నుంచి
పడిపోతున్న ప్రభుత్వాలను
పగిలిపోతున్న పార్టీలను
ప్రవచనాల పార్లమెంటు భవనం
పునాదులమీద నిలిచిన మన ప్రజాస్వామ్యాన్ని
కాపాడండి విప్లవం నుంచి
పాడండి నాలుక చివర సామ్యవాదగీతాలు, చించి
ఆకుపచ్చ విప్లవం గురించి
పీయల్ 480 గిటార్ సవరించి.....

తీర్మానించండి
ఆకుపచ్చ విప్లవం
అరువు తెచ్చుకునే గోధుమల్తో
అమెరికన్ విద్యా ఫౌండేషన్లతో వస్తుందని
పారిశ్రామిక విప్లవం
గుత్తపెట్టుదారుల ఔదార్యంతో వస్తుందని
సామ్యవాదం
రబ్బర్ స్టాంప్ పార్టీటికెట్ల, బ్యూరాక్రసీల, పోలీసుదమన నీతుల
సారాబట్టీల, కులమత విపక్షల
పై సా సాలెగూడులో చిక్కి-న
ప్రజాస్వామ్య ప్రభుత్వాలు సాధిస్తాయని
తీర్మానించండి

అభ్యుదయానికీ, ప్రగతికీ
కమ్యూనలిస్టు, కమ్యూనిస్టుల ఎన్నికలపొత్తు
పూర్వాశ్రమ కాంగ్రెస్, మార్క్సిస్టుల జట్టు
యునీక్ యునైటెడ్ ఫ్రంట్
చిహ్నమని
అభ్యుదయ వాదులంతా ఆనందించండి

అనుమానించండి
వీటిని అనుమానించి
పీపుల్స్ డెమక్రసీ కోరేవాణ్ణి
రక్షించండి నీ బాంచను, అయ్యా, సార్
అజ్ఞానాన్ని, దాస్య భావాన్ని
శిక్షించండి శిరసెత్తిన ఆలోచనను

భాషాభిమానాలు, ప్రాంతీయాభిమానాలు
గత చరిత్ర గర్వాలు, మతాధిక్యతలు
రాజు రక్తం తప్పు చేయదనే విశ్వాసాలు
మామూళ్ళు, మొహమాటాలూ
సంప్రదాయం, సహనం, సలామత్
మన మహోన్నత సంస్కృతి
'పరలోకంలో మోక్షం కోసం'
యీ లోకంలో ఆకలికి చస్తున్న 'యోగులను
'పూర్వజన్మ కర్మఫలం'గా
జన్మంతా అడుక్కుతినే గతి పట్టిన పేగులను
శిబి చక్రవర్తి, రంతిదేవుడు, కర్ణుడు
కపోతాలు కథలు చెప్పి
భర్తృహరి నీతిశ్లోకాలు మప్పి
పబ్బం గడుపుకుంటున్న నాయకులను, ఆచార్యులను
త్యాగులను, విరాగులను
రక్షించండి

భారతీయుని అవసరాలు ఎంత అల్పమో
ప్రపంచానికి చాటిన కొల్లాయిగుడ్డ మహాత్ముని
శిష్యులు బిర్లాలను, ఆగాఖాన్‌లను, మొరార్జీలను
ఆదుకోండి
ఝూట్ ప్రెస్‌లను, వాయిస్ ఆఫ్ అమెరికాలను
పేట్రియట్‌లను, స్టేట్స్‌మన్‌లను
హిందూ ఆర్గనైజర్లను, ముస్లింలీగులను
గొట్టం లాగులను
బడిపంతుళ్ళ బతుకుదెరువుకు
ప్రభుత్వం స్కూళ్ళకన్నా ఉపకరిస్తున్న
కేర్‌లనూ, పాలపొడి డబ్బాలను
కమిటీలు వేస్తే చాలు సాధించామనుకునే
సమైక్యతను
రక్షించండి విప్లవం నుంచి

దేశాన్ని కొల్లగొట్టి ప్రధానికొక యిల్లు గట్టండి
దేశాన్ని కుదువబెట్టి త్రివర్ణపతాకం ఎగరేయండి
స్వతంత్రాన్ని మదుపుబెట్టి ప్రణాళికా సంఘాన్ని
పంచాయితీ రాజ్యాన్ని పోషించండి
ఘోషించండి స్వాతంత్ర్య శంఖారావం
విని విసిగి చెవులు చిల్లులు పడిపోయిన
విగత జీవుల ముందు
చావకుండా లేవకుండా చేసే
చల్లని ధర్మాస్పత్రి మందు

ఆకలి, దరిద్రం, రోగం, సహనం
దోపిడీ, ఎన్నికలు, నినాదాలు, ఉపన్యాసాలు
మతం, దేవుడు, స్వామిభక్తి, భూస్వామిభక్తి
రాష్ట్రభక్తి, దేశభక్తి, మాతృభక్తి
ఆఫీసర్లు, కోర్టులు, పోలీస్ బలం

ఆర్థిక సూత్రాలు, ప్రణాళికలూ, రాజ్యాంగం
మేధావులూ, పైరవీలు
దేనికీ కొదువలేని దేశాన్ని
నదుల నుంచి, అడవులనుంచి, లోయలనుంచి
కొండలనుంచి, పొలాలనుంచి, శ్రమజీవులనుంచి
ఆయత్తమవుతున్న యువతరం
తిరుగుబాటు నుంచి
ఆత్మ విశ్వాసం నుంచి
శ్రామిక శక్తి సంఘటన నుంచి
ప్రజాపోరాటాలనుంచి రక్షించండి
భూ ర్త భూస్వాములను
చక్ర వడ్డీ వ్యాపారులను
కిరాయి పోలీసులను
ఆకాశవాణి ద్వారా రక్షించండి
ప్రజాపోరాటాలను శిక్షించి
ప్రజల్ని రక్షించండి
దేశ సంపదను, ఉత్పత్తిని భక్షించి
దేశాన్ని రక్షించండి
విప్లవాన్ని విరిచేసి
భవిష్యత్తు నిర్మించండి
రక్షించండి! రక్షించండి!!
దేశాన్ని విప్లవం నుంచి రక్షించండి!!

★

ఆహ్వానిస్తోన్నాను విప్లవాన్ని

సి. విజయలక్ష్మి

జాతి శకటాన్ని లాగుతోన్న దానాలేని గుర్రాలూ
దేశం అరకను దున్నుతోన్న మేతలేని ఎద్దులూ
నిరాశలో కూరుక పోయిన సామాన్య ప్రజలూ
ఎదుగూ బొదుగూ లేని జీతాలూ జీవితాలూ.

కొండ విరిగి మీద బడ్డా కుండపెంకుల్లా అడ్డపీతల్లా
బద్దకం జలాల్లో అభ్యంగన స్నానమాచరిస్తోన్న మేధావులూ
ఎండిన తడికల్లాంటి మిడిల్‌క్లాస్ గడియారం పెండ్యులాలూ
తిండికి మాడి చస్తోన్నా గోడౌన్లలోకి వురుకుతోన్న తండులాలూ.

కాషాయం బిట్టలు గట్టుకొన్న సాములోర్ల కి
సాష్టాంగ దండ ప్రణామం గావిస్తోన్న రాజ్యాధినేతలూ
కట్టు కథలకి ప్రాణం పోస్తోన్న పుట్టకొక్కు పత్రికలూ.

జనాన్ని పిట్టల్లా పేల్చేస్తోన్న పోలీసువాళ్ళూ
రక్త సిక్తమైన ఉత్తర్ పారాలూ
కొత్త నెత్తురు తాగుతోన్న జోనంగి కుక్కలూ
నరకాసురులు నిత్యం జరుపుతోన్న కిరాతకాలూ.

ఏదుపంది ముళ్ళలా నిక్కబొడుచుకొన్న
ఇరవై యేళ్ల ఎద్దుమార్కు నిరంకుశత్వం
మొగుణ్ణి గొట్టి మొగసాలకెక్కిన రంకులాడిలా
నడి బజార్లో చెడుగుడాడుతోంది!

గాండ్రిస్తోన్న పెద్దపులి నేటి దేశం
ఘుర్రుమంటోన్న ఆదివరాహం నేటి దేశం

బుసలు గొడుతోన్న అడ నాగు నేటి దేశం
మంటలు గక్కు-తోన్న మధ్యందిన మా ర్తాండ బింబం నేటి దేశం.

బద్దలు గాబోతోన్న అగ్నిపర్వతంపై పానకం కుండలు వర్షించలేను
పగిలి పోయిన దోపిడీ విషభాండాన్ని అతికించడం హర్షించలేను
జనతా త్రినేత్రునిపై మన్మథ శరాల్ని సంధించలేను
కోటానుకోట్ల గుండెల ఆగ్రహాన్ని శాంతి వచనాలతో బంధించలేను.

నిరంతరం ప్రజ్వలిస్తోన్న మానవాగ్ని గుండంలో
నిత్యం చైతన్య సమిధల్ని వేస్తోన్నాను
ఆకలేసి కేకలేస్తోన్న జనం కోసం
విప్లవాన్ని ఆహ్వానిస్తోన్నాను.

ఆకలి మంటల్తో అలమటిస్తోన్న వాడికి
అహింసను బోధించేవాడు లుచ్చా
నిరాశలో కూరుకపోయిన వాడి ముందు వేదాంతాన్ని వల్లించేవాడు
పాలక వర్గాల గంజి మెతుకులు తాగే పాచ్చా.

ఈపాలక వర్గం గోడమీది పిల్లి
ఈపాలక వర్గం రంగులుమార్చే ఊసరవెల్లి
ఇది ఎన్నికలప్పుడు ఎన్ని రంగులైనా వేస్తుంది.
ఆ పిదప ఎముకల్ని విరగ్గొట్టి పిండి జేస్తుంది.

ఈపాలకవర్గం జాతి ద్రోహుల పంచకూళ కషాయం
ఈ పాలక వర్గం గర్భవిచ్ఛిత్తి రాయుళ్ళ ప్రచార కేంద్రం
ఈ పాలక వర్గం అన్నం అడిగిన వాళ్ళ నోళ్ళకి
సున్నం రాసే ఆయారాం గయారాంల మఠం.

రక్తం చిందకండా జరగదు మాత్ర శిశూదయం
చీకటి గర్భాన్ని చీల్చినప్పుడే వేకువ రావడం ఖాయం

దోపిడీ వర్గాల్ని నాశనం జేసినప్పుడే
జరుగుతుంది జాతికి సమగ్ర న్యాయం.

పోరాటమే నేటి జీవిత సమస్యల పరిష్కారం
పోరాటమే నేటి దేశానికి నిత్యావసరం
పోరాటం లేని కుక్క బతుకుల జీవితం
పడుతుంది ఎంగిలి మెతుకుల కారాటం.

మండుతోన్న వర్గ చైతన్యమే మీచేతిలోని ఆయుధం
అభేద్యమైన మీ ఐకమత్యమే జాతికి గాండీవం
అంచేతనే రండి సమస్త మానవులారా రాక్షస సంహారానికి
పదండి దిక్కులేని వారలారా పందుల్ని వేటాడేందుకి.

★

మేమంతా చేపలం
కొడిదలం-కొరమీనులం
బేడిసలం-బుడ్డ పక్కీ-లం
పేర్లు ఏవైనా మేమంతా ఒకే సంతతివారం.
ఈకాలమనే కడలిలో
చేస్తాం మేమూ మీలాగే కాపురం.
అయినా మీ చేతుల్లోనే వుంది మా
ఆయుః ప్రమాణం.

మేము అమాయకులం
ఈ లోకగతి తెలియని అజ్ఞానులం
మా సంతతికుంది ఒక ఆచారం
మా చిన్న వాళ్ళని పెద్ద వాళ్ళం తింటాం
మా చిన్నా పెద్దల్ని, మాకన్నా పెద్దలైన మీరు
తింటానికి మేమే సహకరిస్తాం.
మా ఈ ఆచారం-కాదు.మాకు మేము చేసుకొంటున్న ఈ అపచారం
మీ మనుగడకు చేస్తున్నది సహకారం.
మీరు ఎరవేస్తారు; మీ దగ్గిర వుంది గాలం
మమ్మల్ని చెరబడ్తారు-మేము తగులు కొంటాం
మీ తప్పేముంది?—ఇది మా అజ్ఞానం!

మా ఈ అజ్ఞానం అందిస్తున్నది మీకు అధికారం
ఆ అధికార దర్పంతో చేస్తారు మీరు మమ్మల్ని ఫలహారం.
ఫిష్ పకోడీలు, కట్‌లెట్స్, ఆమ్‌లెట్స్ మీకు చాలా రుచికరం.
మమ్మల్ని పట్టడం సులభం-మమ్మల్ని తినడం సుకరం.
మా కాడ్, షార్క్-లతో మీరు 'ఆయిల్' తీస్తారు.
మమ్మల్ని పిండి మా జీవ రసాయనం త్రాగేస్తారు.
మీరు బలుస్తారు-పెత్తనం మీది-తెలివి మీది.
మా మీద అధికారం చెలా యిస్తారు.

చచ్చిన మమ్మల్ని నిలువ చేయడానికి మీరు చాలా శ్రద్ధవహిస్తారు.
ఉప్పులో, పూరవేస్తారు-మంచు గడ్డల్లో వుంచుతారు
ఏర్ టైట్ టిన్‌లలో-కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరుస్తారు.
మాకోసం మీరు నైలాన్ వలలు తయారు చేస్తారు.
ప్రత్యేకం ఫిషరీస్ డిపార్ట్‌మెంట్లు, మంత్రిత్వశాఖలు నెలకొల్పుతారు
మీరు చాలా మంచివారు!
మా మత్స్యవ తారాన్ని పూజిస్తారు.
మమ్మల్ని ఆదరిస్తారు
మమ్మల్ని ఆరగిస్తారు
అనాదిగా మీరు 'దీన్ని' సాగిస్తున్నారు
అయినా మేము ఖండించ లేకపోతున్నాము

మీరు మానవులు
మేము మీనులం!
మీ న్యాయం
మా న్యాయం ఒక్కటే!-అదే మత్స్య న్యాయం
చిన్న చేపని పెద్ద చేప తినడం-
మీ మానవుల జగతీ-గతీ-ప్రగతీకూడా
మాలాగే వున్నాయట
మీలోనూ
చిన్న చేపల్ని పెద్ద చేపలు తింటాయట
చిన్న చేపల్ని 'ఫాక్టరీ పాండ్స్'లో
'ఎక్స్‌పెన్సివ్ లాండ్స్'లో పెంచుతారట కదూ?
ఆహా! మీ మానవ మీనుల అక్వేరియం
ఎంత అందంగా వుంది-చూశాం మీ మ్యూజియం.
రంగు రంగుల చేపలు-టాప్‌లెస్, బాక్‌లెస్
మినీస్కర్ట్, బికినీల్లో ఎంత అందంగా వున్నారు
శరీరాలను సవారికిచ్చే మీ క్లబ్‌లు-బార్‌లు
ఏ మని చెప్పము మీ సొసైటీ చేపల గురించి?
మీరూ కూలి డబ్బులు-కూటి గింజలు ఎరవేస్తే
తగులుకొనే మీ కూలి చేపల గురించి విన్నాం.
ఏం చేస్తాం?—మీ మానవ మీనులకి బుద్ధివుంది
ప్రయోజనంలేదు. మీరు దోపిడీకి తలొగ్గుతున్నారు.

ఏమైనా మా చిన్న చేపల మహాసభ ఈ మధ్య జరుపుకొన్నాం
పెద్ద చేపలకి బుద్ధి చెప్పాలను కొన్నాం
"బుద్ధి చెప్పలేరు; చేపలకు చేతకాని పనిది" అంది ఒక వృద్ధ మీను
"దేవుడు మన పక్షంలేడు" అంది
గజేంద్ర మోక్షం వివరించింది.
మా సంతతి నాయకుణ్ణి సంహరించిన శ్రీహరి కథ వినిపించింది.
వృద్ధ మీను మాటలకు, దాని బానిస భావాలకు మేము కృద్ధులమైనాము.
హరినైనా, వాడి సిరినైనా, వాడి అబ్బనైనా ఎదిరించాలను కొన్నాం.
ఇకమీద మీ గాలాలకు తగులుకోం
మీ ఎరలకు ఆశపడం
మా ఎర్ర చేపల నాయకత్వాన తిరుగుబాటు చేస్తాం.
మాదీ ఒక రాజ్యం-మాకు కావలసినంతవుంది.
మీ వలలను త్రెంచేస్తాము-మీ గాలాలను కొరికేస్తాం
ఒకవేళ మాలో కొందర్ని మీరు బంధించినా,
ఆరగించడానికి అమ్లెట్లు చేసుకొన్నా
మా ముళ్ళతో మీ గొంతుల్ని గ్రుచ్చుతాము.
ఈ దోపిడీని సహించం
మీ అంతు చూస్తాం.
పోరాడకుండా ఈ దోపిడీ ఆచారాన్ని
అంత మొందించలేమని తెలుసుకొన్నాం."

మీరు మానవులు-బుద్ధి వున్నవాళ్ళు
మా తీర్మానాన్ని ఆలకించండి.
మీ దోపిడీ వలలను తెంచడానికి
నేడే మీరూ ప్రతిన బూనండి.
చిన్న చేపల్ని, పెద్ద చేపలు తినకూడదు
చిన్నా-పెద్దా భేదం వుండకూడదు
ఇదే మా ప్రతిజ్ఞ.
చేతనైతే, చేవవుంటే మీరూ అనుసరించండి మా మార్గం.

★

సత్యం చావదు (డు)

శివుడు

ఆకాశం అరుగు మీద
నలతగా నక్షత్రాలు నిదురించే వేళ
కాలకూట విషసర్పం
సత్యాన్ని మింగేసిందని
నీ కన్నీళ్ళ చన్నీళ్ళని
కొలిమిలా మండే మా గుండెలపై
కుమ్మరించ బోయావు!
నేస్తం! పోరాటం మధ్యలో
అంతులేని కన్నీళ్ళకు
ఆస్కారంలేదు సుమా!
విచారాన్ని విదిలించు;
నీ హృదయంలో ఇపుడే
ఉదయించిన సూర్యునిపై
విషాదం నిషామబ్బుల్ని పాకనీకు.

నమ్ము నేస్తం! సత్యాన్ని చంపలేరు
అది చిరంజీవి!
సత్యాన్ని ఓడించలేరు.
అది అజేయం
ఇప్ప పూవులో నిప్పు రవ్వల్ని
సృష్టించిన సత్యం
కొడవళ్ళకు తిరుగుబాటు పాఠాలను
నేర్పిన సత్యం
నాగేటి చాలులో
నక్షత్రాలను కనుగొన్న సత్యం
అడవిలో రణ శంఖం వూది

మైదానాలను మేల్కొల్పిన సత్యం
అడవి దున్న కంటిలోకి
జనబాణాన్ని సూటిగా కొట్టిన సత్యం
అడవి తేనె అందరికీ
అందించిన సత్యం చావదు
అది జనం! అది ప్రభంజనం!
అది ఖడ్గ సంగీతం! అది యుగ సంకేతం!

నేస్తం! అంతులేని ఆవేదనకు
ఇది కాలం కాదు సుమా!
లే
శోకభారాన్ని కిందికి దించు
దిగంతాల వీస్తున్న
తూర్పు పవనాన్ని
నీ బిందూక్‌లో
భద్రంగా దట్టించు
నీ సూర్యుని కోటి కిరణాల
అరుణ సంగీతాన్ని
నీ జనం గుండెల్లో
బలంగా వెలిగించు.
ఇక విచారాన్ని విదిలించు
పిడికిలి దృఢంగా బిగించు
పోపెత్తిన సముద్రంలా గర్జించు
అలలు అలలుగా క్రమించు
చీకటి కోటల్ని ధ్వంసించు
వెలుగు బావుటా ప్రతిష్ఠించు
వీరుడవై విజృంభించు
విషాదానికి వీడ్కోలు పలికి
విప్లవ శంఖం పూరించు

★

నరుడో! భాస్కరుడా!

శివుడు

[భాస్కరుడు సర్వనామం కాదు; కాలేదు. నా దేశంలో వర్తమానాకాశంలో ఉదయిస్తోన్న నూతన మానవునికి మహోజ్వల సంకేతం భాస్కరుడు. భాస్కరుల్ని మింగిన రాహువులు నిజాల్ని దాస్తారు. ప్రజలు భాస్కరుని బాటనే పయనిస్తారు. భాస్కరుడు ఆ చంద్ర తారార్కం అజరామరం.]

నర్రెంగ సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
కన్నెర్ర సేస్తివయ్యా నరుడో! భాస్కరుడా!
కన్నెర్ర సేసినీవు నరుడో! భాస్కరుడా!
కదనాన దూకితివా నరుడో! భాస్కరుడా!

బర్రెంక సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
బంధూకు పట్తివయ్యా నరుడో! భాస్కరుడా!
బంధూకు సేతబట్టి నరుడో! భాస్కరుడా!
బంధాలు తెంచ్తివయ్యా నరుడో! భాస్కరుడా!

గొట్టంకి సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
గొడ్డళ్ళు నూర్తివయ్యా నరుడో! భాస్కరుడా!
గొడ్డళ్ళు నూరినీవు నరుడో! భాస్కరుడా!
గుడ్డెలుగు కొడ్తివయ్యా నరుడో! భాస్కరుడా!

విప్పపూ సెట్టుకింద నరుడో! భాస్కరుడా!
విల్లు సారించితివా నరుడో! భాస్కరుడా!
విల్లంబు సారించి నరుడో! భాస్కరుడా!
విజయమే అన్నావో నరుడో! భాస్కరుడా!

నీదు శౌర్యం సూసి నరుడో! భాస్కరుడా!
కళ్ళల్లో జిల్లేళ్లా నరుడో! భాస్కరుడా!
కళ్లల్లో జిల్లేళ్లతో నరుడో! భాస్కరుడా!
నీ శిరసు తీస్తిరయ్యా నరుడో! భాస్కరుడా!

శింగేరి గట్టుకింద నరుడో! భాస్కరుడా!
నీ శిరసు తీస్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
నీ శిరసు తీసి వారు నరుడో! భాస్కరుడా!
సిందులే వేస్తిరయ్యా నరుడో! భాస్కరుడా!

సిందీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
సీసాల కెత్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
సీసాల్లో వీమిటన్న నరుడో! భాస్కరుడా!
సారాని సెప్పిరయ్యా నరుడో! భాస్కరుడా!

కారీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
కడవల్ల కెత్తిరయ్యా నరుడో! భాస్కరుడా!
కడవల్లో ఏమిటన్న నరుడో! భాస్కడుడా!
కల్లాని సెప్పిరయ్యా నరుడో! భాస్కరుడా!

పాకీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
పీపాల కెత్తిరయ్య నరుడో! భాస్కరుడా!
పీపాల ఏమిటన్న నరుడో! భాస్కరుడా!
పాలాని సెప్పిరయ్య నరుడో! భాస్కరుడా!

పేరీన నెత్తురంత నరుడో! భాస్కరుడా!
పేరిళ్ళ కెత్తిరయ్య నరుడో! భాస్కరుడా!

పేరిళ్ల ఏమిటన్న నరుడో! భాస్క-రుడా!
పెరుగాని సెప్పిరయ్యా నరుడో! భాస్క-రుడా!

నినుసంపి మముసంపి నరుడో! భాస్క-రుడా:
మాటేసి కాటేయ నరుడో, భాస్క-రుడా!
మాటేసి కాటేయ నరుడో! భాస్క-రుడా!
కుట్రలే పన్నారో నరుడో! భాస్క-రుడా!

బర్రెంక సెట్టుకింద నరుడో! భాస్క-రుడా!
బంధూకు పట్టాము నరుడో! భాస్క-రుడా!
బంధూకు సేతపట్టి నరుడో! భాస్క-రుడా!
బంధాలు తెంచాము నరుడో! భాస్క-రుడా!

నీవు సూపిన బాట నరుడో! భాస్క-రుడా!
మాదొడ్డ బాటయ్యా నరుడో! భాస్క-రుడా!
నీ బాటనే మేము నరుడో! భాస్క-రుడా!
బంధూకు పట్టాము నరుడో! భాస్క-రుడా!

[పీర్ల పండుగనాడు 'థూల' ఆడుతూ యువకులు పాడే ఒక సుదీర్ఘ తెలగాణా జానపద గీతం, ఈ గీతానికి స్పందన. 'థూల' ఒక సామూహిక నృత్య విశేషం]

★

ఘోషించాను
మంచిగా ఉండండర్రా అంటూ
గోల పెట్టాను
అమాయకుల జోలికి పోకండర్రా అంటూ
కల్మషాలని మానసాల లోంచి
కడిగేసు కొండర్రా అన్నాను
కళ్ళల్లో కాంతులు
పోగేసు కొమ్మన్నాను
గతాన్ని నెమరేసుకోవడం
మానేసు కొమ్మన్నాను
మొర పెట్టాను
మొత్తుకున్నాను
మెత్తగా బతిమాలు కున్నాను

విన్నారుకారు
వేలాడుతున్నారు
భూతకాలం చూరుపట్టుకొని
విలువలకి వింతవ్యాఖ్యానాలు చేస్తున్నారు
పాతని బతికించడానికి
కొత్త చిట్కాలు వెదుకుతున్నారు
కొత్తని హతమార్చడానికి
పాత కత్తులు నూరుతున్నారు

ఊరుకుంటానా నేను
కసిగా కసాయిగా
ఉపద్రవంలాగ ఉవ్వెత్తుగా లేచి
సంహారాన్ని స్యందనం చేసి
ఉద్రేకతరంగాలే తురంగాలుగా
ఆగ్రహం కొరడాని చేబూని
సాయుధ విప్లవ బీభత్సుని సారథినై
భారత కురుక్షేత్రంలో
నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను
మంటలచేత మాట్లాడించి
రక్తంచేత రాగాలాపన చేయిస్తాను.

★

నిన్నటి జట్కావాలా

శ్రీశ్రీ

తాను సాలీసాలని గడ్డితిని
నాకు రోజూ వణ్ణం యెట్టేదండి నా గుర్రం
రెండ్రోజుల్నించీ ఆ గడ్డి కూడా తిన్నేదు
నిన్న సచ్చి పోనాది
కవిగోరూ
యినండి నాగోడు
యేటలా రాసుకు పోతున్నావు
ఆగవయ్యా యెర్రి బ్యామ్మడా
అన్నట్టు నువ్వు బ్యామ్మణ్ణనుకోవడం
మానీశావటగా
పోనీ యినవయ్యా మనిసీ
నే సెప్పిందంతా యిశదంగా యిని
లచ్చనంగా గయోపాక్యానంలో పజ్యాల్లాగ
జమాయించి రాసీ
అలాంటియి నువ్వు ఎడం సేతి
సిటికెనేలు గోటితో గీకేస్తావటగా
అదంతా యిప్పుడొగ్గీసినావా
ఆయితే సూడు ఆ మద్దిన మనూ రొచ్చాడే
జరీకండవా యేసుకుని
అబ్బెదవ కవి
ఆడినాగ జణకజణా జణకజణా
కాయితాల మీద అచ్చరాల్ని లగెత్తించు
కాదు నాయేడుపే కావాలంటావా
అయితే యేడు
కాదు యిను
నిన్న సింగపూరు నించి స్టీమరొచ్చింది సూడూ

అందులోంచి దిగాడో నల్లదొర
ముండల కంపెనీకి తీసుకెళ్ళమంటే
మూడ్రూపాయలకి బేరం కుదుర్సుకున్నాను
గుర్రం కదిల్తేగా
కొట్టేను తిట్టేను
ఒట్టుకూడా యేసేను
చలోచల్ చల్రే బేటా అన్నాను
(ఇందీలో సెబితే యినుకుంటాదేమోనని)
ఒంట్లో ఓపికుంటేగా
ఒక్కడుగేనా ముందుకెయ్యడానికి
ముడ్డంటా నోటంటా నెత్తు రోడ్చుకుంటా
ముక్కుతోంది
సింగపూరు బాబు గైరు హాజరైపోనాడు
యిలాంటోళ్ళే యేయేవో జబ్బు లొట్టుకొస్తారట
మనుసులికే కాక
పసువులికి కూడా
తగిలించేస్తారు కామాల
పసువుల డాక్టేరు దగ్గిరికి పరుగెత్తుకెళ్లేను
ఒక్క పాలొచ్చి సూడండన్నాను
వది రూపాయలు పట్రమ్మన్నాడు
ఎలా సవ్వను
సరే అది బతికితేసాలు ఆ తర్వాత సూసుకుందామని
పటకాగిటకా అదీయిదీ అమ్మేసి
అజ్జెంటుగా అయిదూ పదీ పోగుచేసి
జరూరుగా సదివించుకున్నాను
దారిలో నాసేతొక సూదిమందు సీసా కొనిపించాడు
గుర్రానికి రెండేపులా రగతం
నారెండు కళ్ళల్లో కన్నీళ్ళ నాగ
నాబంనేదు బతకదన్నాడు
అన్నపెకారం ఆది బతకనేదు
మా సత్తెమైన మనిసి

(యేటాగి పోనావు
కలంలో సిరా నిండుకుందా
యెందుకలా దులపతావు
అందులోంచి యేటీ రాలదు
యింద పెనసలు ముక్క-
యీదిలో దొరికింది
యెవడిదో యిస్కూలు కుర్రోడిది
నూర్రూపాయల కలంతోనైనా
నువ్వింతకన్నా యేం రాస్తావులే రాసుకో)
నిక్కచ్చిగా నిజం సెబుతున్నాను గురూ
నిన్న చేల్నించీ నాకు తిండే సయించనేదు
ఏడ్చాను ఏడ్చాను
ఏడిస్తే నాబంనేదని యిరమించీసుకున్నాను
ఎద్దు నాగ యెక్క-డెక్క-డో తిరిగాను
ఏదిరా దారి బగమంతుడా అనుకుంటానే
ఎక్క-డున్నాడాడు
సిమ్మాచెలం కోవిల్లోనా
సింతసెట్టు సివర్లోనా
దరగా కొండ మీదనా
గ్యానాపురంలోనా
ఎక్క-డున్నాడు
ఉంటే యేటి సేస్తున్నాడు
అబ్బోరబ్బ నాలాటోళ్లని రచ్చించడమే ఆడిపనా
అసలాడంటూ ఉన్నాడా
ఉంటే మాత్రం ఆడెవడు నన్ను రచ్చించడానికి
అప్పుడప్పుడాన్ని తలుసుకుంటాను గాని
అదో పిరికితనం
కయాస్సెరుడివి నీ దగ్గిర దాసడమెందుకు
యేడాది కిందచేటయిందో తెలుసా
యెలంపేటలో అందరికీ యెరిక
నా మూడేళ్ళ కొడుకు సచ్చిపోతే
యిశారంసేత
గూని సాకలోడితో నెగిసిపోయింది నా పెల్లాం నంజ

అప్పుడు కూడా యింత
బాదపడనేదంటే నమ్మండి కవిగోరూ
నిన్న రాత్రంతా సముద్ర పొడ్డునే కూకున్నాను
సెప్పకేం సచ్చిపోదామనే అనుకున్నాను
ఏం సెయ్యాల నేను
ఏం కావాల నా బదుకు
రేత్తిరంతా యిదే ఆలోశన
సీ సవ్వ కూడదు
సచ్చి సాదించేదేటి
ఏది సేసినా బతికున్నప్పుడే సెయ్యాల
బతికున్నోడే సెయ్యాల
మనిసంత మనిసిని
గుర్రం సచ్చిందని నేనూ సవ్వడమేనా
కుక్కలు సవ్వనేదూ
నక్కలు సవ్వనేదూ
సినీమా యిస్టారులు సవ్వనేదూ
సీకటి బజాకోళ్లు సవ్వనేదూ
నేను మాత్రం సావను
సచ్చేదాకా బతికే తీరతాను
సావ్వలిసి నోళ్ళని సంపే తీరతాను
పర్వాలేదురా బేటా అని
నాకు. నేనే బరవసా సెప్పుకున్నాను
నా గుర్రమే నా కళ్ల ముందాడుతోంది
నా మూడేళ్ల కొడుకు నాగ
అప్పుడనిపించింది నాకు
సికాకులం యెల్లి పోవాలని
సెప్పవయ్యా సిరిసిరి మువ్వా
(సరుపుకి తొడ నొచ్చిందా)
యిప్పుడు సెప్పు మరి
యెల్లమంటావా వొద్దంటావా
నువ్వెల్లమన్నా వొద్దన్నా
నేనెల్లక మాననులే

★

కాలం కాలిన పొగ వాసన

కోట సత్యనారాయణ

రావణాసురుని కాష్ఠంలా కాలుతున్న
కార్మిక లోకపు కష్టాల తడికట్టెల మీద
ఇన్ని చన్నీళ్లుపోసి పొంగకండి
బాధాలోకపు ఆవేదనలు సుళ్లు తిరిగి
భయంకర పిశాచ రూపం ధరించి
పొగలై సెగలై ఆకాశాన్నంటి
కమ్ముకొస్తున్న పొగ వాసన
కాలాన్ని కూడా మూసి వేస్తుంది
కనబడకుండా దాచేస్తుంది
శతకోటి కెరటాల్లా విరుచుకుపడి
నిర్దాక్షిణ్యంగా మిమ్మల్ని నలిపేస్తుంది
హిరోషిమా పై వేసిన ఆటంబాంబు
ఉత్తర వియత్నాంలో మీ పైటర్లు
ఈ మంటను చల్లార్పలేవు
కారు మేఘాల్ని సృష్టించినా
పెను తుఫానులు వీయించినా
కాలం కాలుతూనే వుంటుంది
ఆ పొగ వాసన మీ అందర్నీ
చంద్ర లోకంలో దాక్కున్నా
చుట్టుముట్టి హతమారుస్తుంది
లాభం లేదు గోలచేసి గీపెట్టి
ఈ ఒక్క రాత్రి మీ బ్రతుకు
ముగిసి తెల్లవారేక
సర్వం నాస్తి కిమన్నాస్తి
వియత్నాం ప్రజల హృదయ జ్వాలల్లో
పుట్టిన ఈ అగ్ని చల్లారదు సరికదా
కొరియాలో ఆ జనం అందుకొని

పశ్చిమాసియాలో భగ్గున మండి
మీ చితాభస్మాల్ని ఏ పవిత్ర జలాలకీ
అందకుండా ఎడారిలోకి మోసుకెళ్తుంది
బలీయ విషసర్పం కొట్టుతూన్న బుసలు
బాధా సర్పదష్టుల్లోంచి పుడ్తాయని
అగ్ని పర్వతాల్లో మరిగి ప్రవహిస్తున్న లావా
బ్రతుకు శోకమై నిరాశతో రగిలే
ఆకలి బాధ కాగలేని అల్పుల్లోంచే వచ్చిందని
ఘోష పెడ్తూన్న సముద్ర తరంగాల వికటాట్టహాసం
చేదు బ్రతుకు త్రాగ లేక సర్వనాశనమైన
దిక్కు-లేని దారిలేని మానవాళి
ఎర్రటి మంటలతో భగభగమని
పశ్చిమాన మండుతున్న ఆకాశపు టంచులు
హఠాత్తుగా జగత్తు నాక్రమించి
సర్వం స్వాహాచేసి సమానత్వం సాధిస్తాయని
తెలుసుకునే లోపలే
కాలం కాలిన కమురు వాసనతో
ఆ పొగలు మిమ్ము కబళించి
మరో ప్రపంచ పునాదులకి
మిమ్మల్ని సమాధులుగా చేస్తాయి.

★

సైన్యంలో చేరకు

జి. సోమయ్య

ఆరాజో, ఈరాజో
రాజ్య మేలాలంటే
ఈ సైన్యం, ఆ సైన్యం కొట్టుక చావాలి
ఈ రాజ్యపు పేదోడూ
ఆ రాజ్యపు పేదోడూ
కొట్టుక చావాలి.
సైన్యంలో చేరండనే దేశభక్తి
పూర్వకమైన పదాలతో మోసపోయి
నా రాజ్యం, నా ప్రజలు అన్న వెర్రి గర్వంలో పడి
నీవు కత్తి కట్టింది నీతరం పైనే
నీతరం బలగాన్ని, బలాన్ని
నరకడానికి నీవే ఆయుధమౌతున్నావు!
ఎంత మంది సత్తే
అంతమంది పేదోళ్ళ పీడొదులుద్ది.
వీర మరణం కాదది
వెధవ మరణం, వెర్రి మరణం
మన నెత్తి మీదున్న బూటు బరువును
తెల్సుకోనీకుండా
'మెదడు' లేని జీవాల్ని జేసి
ఆడించే నాటకంలో
నీవూ, నేనూ యిట్లా
ఎంత కాలం బలౌదాము!
ప్రతిజ్ఞ సెయ్యి,
నీ కడుపు కోసుకోనని
నీ ముందున్నోడు యిరోది కాదు
గుండు నీ ఎన్కోని గుండెలో
గుచ్చుకుంటదని, మాటియ్యి
ఇద్దరం కల్సికలియబడదాం.

★

జననం

నగ్నముని

మెలిదిరిగిన కండరాలు కాయకష్టంలో కమిలిపోతున్నా
గంజిమూకిట్లో రెండు మెతుకులు లేవు
దారిద్ర్యం మన శత్రువు
యవ్వనమంతా విశ్వవిద్యాలయం పడగనీడల భవనాల్లో బంధించినా
యువతరం చదువుల బతుకులలో వెలుగులేదు
అజ్ఞానం మన శత్రువు
నీరసజాతిని భోగించే నీరసజాతి నీరసజాతినే కంటుంది
నీరసత్వం వారసత్వం సాంప్రదాయమై అన్ని రంగాలా అధికారం చలాయిస్తుంది
నపుంసకత్వం మన శత్రువు
యాచనతో పెంచిన శరీరంలో ప్రవహించేది
మూత్రం తప్ప రక్తం కాలేదు
పరరాజ్యాల బిచ్చపు పప్పుకూడు మన శత్రువు
రక్తంతో ఆర్జించిన స్వాతంత్ర్యం జాతి జనుల పాలిట మృత్యువు
నేటి వ్యవస్థ
నేటి తరం పాలుపోసి పెంచుకుంటున్న అందమైన మృత్యువు
ఈ
రాజకీయాంధకారంలో
ఒకేఒక మార్గం తప్ప శరణ్యం లేని
ఒకేఒక నక్షత్రం ప్రసరించే వెలుతుర్లో నిజం చెబుతున్నాను
అజ్ఞాతం కొండల మాటునుండి
చిక్కని దారిద్ర్యపు అడవుల మారుమూలల నుండి
ఈ చీకటి వ్యవస్థా గర్భాన్ని చీల్చి
పొడుచు కొస్తున్నాడు కిరణాయుధ సూర్యుడు

రుంరు.....59

నేల యోని చీలి
రక్తమాంస వీర్యాలతో
ఈ కుష్టు ఉచ్చిష్ట వ్యవస్థపై తిరగబడి
మనిషికీ మనిషికీ మధ్య అడ్డు గోడలులేని ఆర్థిక అసమానత్వపు అమానుషత్వం లేని
ప్రపంచాన్ని ప్రమాణాల్ని ప్రజాప్రభుత్వాల్ని నిర్మించే మనుషులు కావాలిప్పుడు
ప్రతి తల్లీ
ఒక సూర్యుణ్ణి ప్రసవిస్తే చాలు.

★

035,1NRD,J
35-N70
150254

J H A N J H A

ANTHOLOGY OF FIGHTING POEMS

VIPLAVA RACHAYITALA SAMGHAM

540

For Copies

NIKHILESWAR

46, VIDYANAGAR COLONY,

HYDERABAD-13.